
సాక్షి అనంతపురం

గురువారం । 5 । డిసెంబర్ । 2024



చీనీ టన్ను రూ.25,500

అనంతపురం మార్కెట్‌యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.25,500 పలికాయి.



టమాట కిలో రూ.33

అనంతపురం కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.33 పలికింది. కనిష్టం రూ.23, సరాసరి ధర రూ.28 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
29.4°/19.8°

జిల్లా అంతటా బుధవారం తుపాను వాతావరణం కొనసాగింది. చలి తీవ్రత కొంత తగ్గింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి నుంచి తుంపర్లు పడ్డాయి.

న్యూస్‌రీల్

రైతులపై 'ఫెంగల్' పగ

- కన్నీరు పెట్టిస్తున్న తుపాను



గార్లదిన్నె మండలంలో వర్షానికి తడిసిన వరి ధాన్యాన్ని చూపిస్తున్న రైతులు

అనంతపురం అగ్రికల్చర్: ఫెంగల్ తుపాను రైతులకు నష్టాన్ని మిగిల్చింది. గత ఐదు రోజులుగా జిల్లా అంతటా తుపాను వాతావరణం నెలకొంది. ఆకాశం మేఘావృతమై జడితో కూడిన తేలికపాటి వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ధాన్యం నూర్పిడికి అడ్డంకిగా మారింది. ప్రధానంగా వరి కోతలు, నూర్పిడి జోరుగా సాగుతున్న తరుణంలో ఫెంగల్ తుపాను కారణంగా రైతులు నష్టపోతున్నారు. వరితో పాటు పప్పుశనగ, వేరుశనగ, పత్తి, ఆముదం, మొక్కజొన్న తదితర పంటల నూర్పిడికి కూడా ఆటంకం కలగడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాగల రెండు రోజులు కూడా వర్షసూచన ఉండటంతో ఆందోళన చెందుతున్నారు.

మామిడి, టమాటకు వాతావరణ బీమా

- ఈనెల 15 లోపు ప్రీమియం చెల్లించాలని సూచన



అనంతపురం అగ్రికల్చర్: ఈ రబీలో టమాట, మామిడి పంటలకు వాతావరణ బీమా వర్తింపజేస్తున్నట్లు ఉద్యానశాఖ డీడీ బీఎంవీ నరసింహారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు తమ వాటా కింద 5 శాతం ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు. టమాట రైతులు ఎకరాకు రూ.1,600, మామిడి రైతులు ఎకరాకు రూ.1,650 ప్రకారం ఎన్ని ఎకరాలకైనా ప్రీమియం చెల్లించవచ్చన్నారు. అకాల వర్షాలు, అధిక వర్షపాతం, అధిక ఉష్ణోగ్రతలు, చీడపీడల వాతావరణం లాంటి ఆన్‌లైన్ డేటా ఆధారంగా బీమా పరిహారం లెక్కలోకి తీసుకుంటారని తెలిపారు. నిబంధనల మేరకు నష్టం జరిగితే టమాట ఎకరాకు రూ.32 వేలు, మామిడి ఎకరాకు రూ.33 వేల ప్రకారం చెల్లిస్తారని పేర్కొన్నారు. బ్యాంకులు, కామన్ సర్వీసు సెంటర్లు (సీఎస్‌సీ), మీ–సేవ, బీమా కంపెనీ పోర్టల్‌లో రైతులు తమ వాటా కింద ప్రీమియం డబ్బును ఈ నెల 15లోపు చెల్లించాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఆర్‌ఎస్‌కే అసిస్టెంట్లు, ఉద్యాన శాఖ అధికారులను సంప్రదించాలని కోరారు.

సర్పంచ్‌పై టీడీపీ నేత దాడి



గాయపడిన సర్పంచ్ నరసింహులు

ఆత్మకూరు: మండలంలోని మది గుబ్బ గ్రామానికి చెందిన సర్పంచ్ బోయ నరసింహులుపై అదే గ్రామానికి చెందిన టీడీపీ నేత మాధవరాజు దాడి చేశాడు. ఘటనలో ఆయన చేతికి బలమైన రక్తగాయమైంది. పోలీసులు తెలిపిన మేరకు... తన అన్నతో కలసి ఓ స్థల వివాదంపై బుధవారం వీఆర్వోతో చర్చించేందుకు సచివాలయానికి సర్పంచ్ నరసింహులు వెళ్లారు. స్థలం విషయంపై వీఆర్వోతో మాట్లాడుతుండగా అక్కడే ఉన్న టీడీపీ నేత మాధవరాజు జోక్యం చేసుకుని కవ్వింపు చర్యలకు దిగాడు. వ్యక్తిగతంగా దూషిస్తూ కుర్చీతో నరసింహులుపై దాడి చేశాడు. ఘటనలో సర్పంచ్ చేతికి బలమైన రక్తగాయమైంది. పక్కనే ఉన్న స్థానికులు కల్పించుకుని సర్ది చెప్పడంతో మాధవరాజు అక్కడి నుంచి వెళ్లిపోయాడు. అనంతరం ఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌కు సర్పంచ్ నరసింహులు చేరుకుని ఘటనపై ఫిర్యాదు చేశారు. క్షతగాత్రుడిని పోలీసులు ఆస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. దాడికి సంబంధించి పరస్పర ఫిర్యాదులు అందడంతో ఇద్దరిపైనా కేసులు నమోదు చేసి, విచారణ చేపట్టినట్లు తెలిపారు.

సర్వేకు సహకరించండి

అనంతపురం టౌన్: సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్‌ఎంఈ) సర్వేకు జిల్లాలోని పరిశ్రమల నిర్వాహకులు సహకరించాలని పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీధర్ కోరారు. ఎంఎస్‌ఎంఈ సర్వే, సపోర్టు పేరుతో ప్రత్యేక మొబైల్ యాప్‌ను పరిశ్రమల శాఖ రూపొందించింది. ఈ యాప్‌లో ప్రతి యూనిట్ వివరాలను నమోదు చేయనున్నారు. ఈ నమోదు ఆధారంగా ఆయా పరిశ్రమలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహకాలు అందనున్నాయి. దీని కోసం గురువారం నుంచి 2025, ఫిబ్రవరి 1వ తేదీ వరకూ సర్వే చేపట్టనున్నారు.

పాఠం.. పాపం

- సరిహద్దు మండలాల్లోని పాఠశాలల్లో తీవ్రంగా సబ్జెక్టు టీచర్ల కొరత
- నష్టపోతున్న విద్యార్థులు

- గుమ్మఘట్ట మండలం గోనబావి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 555 మంది విద్యార్థులున్నారు. వీరిలో పదో తరగతి విద్యార్థుల సంఖ్య 62. స్కూల్లో మూడు ఇంగ్లిష్ టీచర్ పోస్టులుంటే అన్నీ ఖాళీనే. కనీసం ఈ స్కూల్‌కు ఏ ఒక్కరినీ సర్దుబాటు చేయలేదు. ఇంగ్లిష్ పాఠాలు చెప్పే టీచరు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదే మండలం పూలకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 33 మంది 'పది' విద్యార్థులున్నారు. హిందీ టీచరు లేకపోవడంతో పాఠాలు మొదలు కాలేదు. హిందీ పేరు చెబితే పిల్లలు దిక్కులు చూస్తున్నారు.

- రాయదుర్గం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగులో మూడు, ఇంగ్లిష్‌లో మూడు టీచర్ పోస్టులుండగా, అన్నీ ఖాళీనే. డి.హీరేహాళ్ మండలం మురడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ, తెలుగు సబ్జెక్టులకు టీచర్లు లేరు. ఒక్క టీచరునూ సర్దుబాటు చేయలేదు. ఈ పాఠశాలల్లోనే కాదు... గుమ్మఘట్ట జెడ్పీహెచ్ఎస్, గోనబావి జెడ్పీహెచ్ఎస్, పూలకుంట జెడ్పీహెచ్ఎస్, రాయదుర్గం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పాపంపల్లి జెడ్పీహెచ్ఎస్, భూపసముద్రం జెడ్పీహెచ్ఎస్, టి.వీరాపురం జెడ్పీహెచ్ఎస్, గుండుగారిపల్లి జెడ్పీహెచ్ఎస్ తదితర స్కూళ్లలో సబ్జెక్టు టీచర్లు లేరు.



రాయదుర్గంలోని ప్రభుత్వ పాఠశాల



- తల్లిదండ్రుల తీవ్ర ఆందోళన
- అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదంటున్న హెచ్ఎంలు
- టీచర్ల సర్దుబాటును తూతూమంత్రంగా చేసిన ప్రభుత్వం
- ఇప్పటికైనా తేరుకోకపోతే ఫలితాలపై తీవ్ర ప్రభావం

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లాలోని సరిహద్దు మండలాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను సబ్జెక్టు టీచర్ల కొరత తీవ్రంగా వేధిస్తోంది. దాదాపు 40 స్కూళ్లలో వివిధ సబ్జెక్టులకు టీచర్లు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. టీచర్ల కొరతపై ఆయా పాఠశాలల హెచ్ఎంలు పలుమార్లు డిప్యూటీ డీఈఓలు, డీఈఓ, ఆర్జేడీకి విన్నవించినా.. ఇప్పటిదాకా టీచర్లను సర్దుబాటు చేయలేదు.

ఇష్టారాజ్యంగా సర్దుబాటు..

ఇటీవల ప్రభుత్వం టీచర్ల సర్దుబాటు చేసినా జిల్లాలో ప్రక్రియను తూతూమంత్రంగా చేసి చేతులు దులుపుకున్నారు. చాలామంది ఎస్జీటీలకు ఆయా సబ్జెక్టులు బోధించేందుకు అర్హతలున్నా... వారిని మిగులుగా చూపించలేదు. ఎడిట్ ఆప్షన్ రావడంతో ఎంఈఓలు, డీఈఓ కార్యాలయ ఉద్యోగులు తమకు అనుకూలంగా ఉన్న ఎస్జీటీలకు డిగ్రీ, బీఈడీ అర్హతలు తొలగించి కేవలం ఇంటర్, డీఎడ్ మాత్రం చూపించి 'మిగులు' జాబితాలోకి రాకుండా జాగ్రత్త పడ్డారని పలువురు హెచ్ఎంలు, ఉపాధ్యాయులు వాపోతున్నారు.

ఉత్తమ ఫలితాలెలా..?

ఇప్పటికే సగం విద్యా సంవత్సరం పూర్తయింది. మరో నాలుగు నెలల్లో వార్షిక పరీక్షలు జరగనున్నాయి. ప్రభుత్వమేమో 'పది' విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు 100 రోజుల షెడ్యూల్‌తో ప్రత్యేక ప్రణాళిక తయారు చేసి పంపింది. ఈ షెడ్యూలు ప్రకారం విద్యార్థులను సన్నద్ధం చేయాలంటూ ఆదేశాలు జారీ చేసింది. అన్ని సబ్జెక్టులకూ ఏడాదిపాటు చదువు చెప్పినా ఫలితాలు అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. అలాంటిది కొన్ని సబ్జెక్టులకు అసలు చదువే చెప్పకపోతే ఆ విద్యార్థుల పరిస్థితి ఎలా ఉంటుంది? వారెలా పాసవుతారు, ఫలితాలెలా ఉంటాయో ఊహించుకోవచ్చు. ఇప్పటికైనా అధికారులు తేరుకోకపోతే ఉమ్మడి జిల్లాలోని సరిహద్దు మండలాలైన రాయదుర్గం, డి.హీరేహాళ్, బ్రహ్మసముద్రం, కళ్యాణదుర్గం, కుందుర్పి, శెట్టూరు, మడకశిర, రొళ్ల,అమరాపురం, అగళి, గుడిబండ తదితర మండలాల్లో పదో తరగతి ఫలితాలపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడటం ఖాయంగా కనిపిస్తోంది.

సర్దుబాటు చేస్తాం



సరిహద్దు మండలాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత ఉన్నది వాస్తవమే. జిల్లాకు నేను కొత్తగా వచ్చాను. టీచర్ల సమస్య నా దృష్టికీ వచ్చింది. సబ్జెక్టు టీచర్లు లేకపోతే పిల్లలకు నష్టం జరుగుతుంది. దీనిపై కసరత్తు చేస్తున్నాం. డీవైఈఓలను పిలిపించి మాట్లాడుతున్నాం. అర్హత కల్గిన ఎస్జీటీలను, మిగులుగా ఉన్న టీచర్లను ఆయా స్కూళ్లకు సర్దుబాటు చేస్తాం. వీలైనంత త్వరగా దీనిపై చర్యలు తీసుకుంటాం.

– ఎం.ప్రసాద్‌బాబు, డీఈఓ

ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు కావాలి



పాఠశాల ప్రారంభం నుంచి తెలుగు, ఇంగ్లిష్ సబ్జెక్టులకు ఉపాధ్యాయులు లేరు. దీంతో ఆ సబ్జెక్టులు నేర్చుకునేందుకు చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఏమీ అర్థం కావడం లేదు. ఇతర సబ్జెక్టులకు వచ్చే టీచర్లతోనే సర్దుకోవాల్సి వస్తోంది.

– తరుణ్‌కుమార్, 10వ తరగతి, రాయదుర్గం

చాలా కష్టంగా ఉంది



మా స్కూల్‌లో పాఠశాల ప్రారంభం నుంచి ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు లేరు. దీంతో సబ్జెక్ట్ అర్థం కాక ఇబ్బందులు పడుతున్నాం. ఆ సబ్జెక్టులో ఇప్పటిదాకా ఏ ఒక్క పాఠమూ నేర్చుకోలేదు. పరిస్థితి ఇలాగే కొనసాగితే పబ్లిక్ పరీక్షల్లో కష్టంగా ఉంటుంది.

– నితిన్, 10వ తరగతి, గుమ్మఘట్ట హైస్కూల్

హిందీ ఎవరూ చెప్పడం లేదు



విద్యా సంవత్సరం ప్రారంభమై ఐదు నెలలవుతున్నా ఇప్పటికీ మా స్కూల్‌లో హిందీ టీచరు లేరు. దీంతో ఎలా చదువుకోవాలో అర్థం కావడం లేదు. ఇప్పటివరకూ హిందీ బుక్కే చూడలేదు. పరీక్షలు దగ్గరకొస్తున్నాయి. హిందీ పరీక్షను తలచుకుంటేనే భయమేస్తోంది.

– లోకేష్, 10వ తరగతి, పూలకుంట, గుమ్మఘట్ట మండలం

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి

- ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు



మాట్లాడుతున్న సీఎండీ సంతోషరావు

అనంతపురం టౌన్: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని ఎస్పీడీసీఎల్ చీఫ్ మేనేజింగ్ డైరెక్టర్ సంతోషరావు అధికారులను ఆదేశించారు. బుధవారం నగరంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల ఎస్ఈలు సంపత్‌కుమార్, సురేంద్రతో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోతలు లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలన్నారు. జిల్లాలో విద్యుత్ మెటీరియల్ కొరత ఉందని, చాలా మంది డీడీలు చెల్లించి ఎదురు చూస్తున్నారని తెలిసిందని, 15 రోజుల్లో పరికరాలు సరఫరా చేస్తామని చెప్పారు. లో ఓల్టేజీ సమస్యలు తలెత్తకుండా అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు సైతం వేగవంతంగా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. వ్యవసాయ సర్వీసుల కోసం రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. రైతులు కోరిన సమయంలో విద్యుత్ సరఫరా చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఈ జేవీ రమేష్, ఏడీ శ్రీనివాసులతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

ప్యాసింజర్ రైళ్లకు కొత్త నంబర్లు

గుంతకల్లు: పలు ప్యాసింజర్ రైళ్లకు కొత్త నంబర్లు కేటాయించినట్లు డివిజన్ కార్యాలయ వర్గాలు బుధవారం తెలిపాయి. హుబ్లీ–తిరుపతి స్పెషల్ ప్యాసింజర్ రైళ్లకు ప్రస్తుతం 07658/07657 నంబర్లు ఉండగా, వాటిని 57402/57401గా మారుస్తున్నట్లు తెలిపారు. గుంతకల్లు–చిక్‌జాజూర్ (07586/07585) స్పెషల్ ప్యాసింజర్ రైళ్లకు 57415/57416గా, తిరుపతి–కదిరిదేవరపల్లి (07589/07590) స్పెషల్ ప్యాసింజర్ రైలు నంబర్‌ను 57405/57406గా మార్పు చేస్తున్నట్లు వివరించారు. జనవరి 1 నుంచి కొత్త నంబర్లతో రైళ్లు రాకపోకలు సాగిస్తాయని, ప్రయాణికులు గుర్తించాలని సూచించారు.

జీజీహెచ్‌లో రేడియాలేజీ!

- పరికరాల కొరతతో రోగులకు తీవ్ర ఇబ్బందులు

అనంతపురం మెడికల్: కూటమి ప్రభుత్వంలో బోధనాస్పత్రిలో సౌకర్యాలు మృగ్యంగా మారుతున్నాయి. ప్రభుత్వ సర్వజనాస్పత్రి(జీజీహెచ్)లోని రేడియాలజీ విభాగంలో పరికరాల కొరతతో అటు సిబ్బంది.. ఇటు రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా ఎక్స్ రే, అల్ట్రాసౌండ్ స్కాన్‌లకు అవస్థలు పడాల్సి వస్తోంది.

పరికరాల కొరత.. : సర్వజనాస్పత్రిలో ఎక్స్‌రే తీసిన తర్వాత అప్‌లోడ్ చేసే క్యాసెట్లు కేవలం పెద్దవి రెండు, చిన్నవి రెండు ఉన్నాయి. మెడిసిన్, ఆర్థో, సర్జరీ, పల్మనాలజీ తదితర విభాగాల నుంచి రోజూ 300 నుంచి 400 మందికి ఎక్స్‌రే తీయాల్సి ఉంటుంది. అల్ట్రాసౌండ్ స్కాన్ సెంటర్‌లో రోజూ 150 నుంచి 180 మందికి స్కాన్‌లు నిర్వహిస్తున్నారు. నిత్యం 40 నుంచి 50 మంది గర్భిణులకు స్కాన్ చేయాల్సి ఉంటుంది. అయితే, ఆస్పత్రిలో కేవలం మూడు అల్ట్రాసౌండ్ మిషన్లే ఉండటంతో ఇబ్బందులు తప్పడం లేదు. అరకొర సౌకర్యాలతోనే ఎక్స్‌రే, సిటీ స్కాన్‌లు తీస్తున్నారు. దీనిపై ఆస్పత్రి సూపరింటెండెంట్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు వివరణ కోరగా.. ఎక్స్‌రేకు సంబంధించి క్యాసెట్ల కొరత ఉన్న మాట వాస్తవమేనని ఆయన చెప్పారు. క్యాసెట్ల కొనుగోలుకు ఆర్డర్ ఇచ్చామన్నారు. అల్ట్రాసౌండ్ స్కాన్ మిషన్లు కావాలని ఉన్నతాధికారులకు నివేదించామన్నారు.



ఆస్పత్రిలోని అల్ట్రాసౌండ్ స్కానింగ్ గది వద్ద రోగుల పడిగాపులు

కసాపురంలో రెండు రోజుల హనుమద్ వ్రతాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాస్

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో ఈనెల 12,13 తేదీలలో రెండు రోజుల పాటు జరగనున్న హనుమద్ వ్రతాలను విజయవంతం చేద్దామని ఆర్డీఓ ఏబీవీఎస్‌బీ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బుధవారం ఆలయ సమీపంలోని రామదూత నిలయంలో ఉత్సవాల నిర్వహణపై ఆలయ సిబ్బంది, వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 12న వేలాదిమంది మాలధారులతో గుంతకల్లు పట్టణంలోని హనుమాన్ సర్కిల్ నుంచి కసాపురం దేవస్థానం వరకూ శోభాయాత్ర సాగుతుందన్నారు. దీక్షా స్వాములు సమర్పించిన ఇరుముడి ద్రవ్యాలతో సాయంత్రం 6.30 గంటలకు 'హోమగుండ ప్రజ్వలన' కార్యక్రమం ఉంటుందన్నారు. 13వ తేదీ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ఆలయ సమీపంలోని గంగా నిలయం ప్రాంగణంలో హనుమద్ వ్రతం నిర్వహిస్తారన్నారు. ఉత్సవాల్లో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొననున్న నేపథ్యంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లను చేయాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా పోలీస్ బందోబస్తు పకడ్బందీగా ఉండాలన్నారు. శానిటేషన్, తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఎక్సైజ్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో ఆలయ ఈఓ కే.వాణి, ధర్మకర్త సుగుణమ్మ, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ శ్రీకాంత్ చౌదరి, రూరల్ సీఐ ప్రవీణ్ కుమార్, కసాపురం ఎస్ఐ వెంకటస్వామి, ఆర్టీసీ సేవా సమితి సభ్యులు, వివిధ శాఖల అధికారులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

- జనవరి 8 వరకు నిర్వహణ

అనంతపురం అర్బన్: భూ సమస్యలకు పరిష్కారం చూపడం కోసం జిల్లాలో శుక్రవారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నారు. జనవరి 8 వరకూ సదస్సులు సాగుతాయి. ఇందుకోసం ప్రభుత్వం జిల్లాకు రూ.10 లక్షల బడ్జెట్ కేటాయించింది.

రెవెన్యూ సమస్యలే అధికం..

ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు వందల్లోనే అందుతుంటాయి. అధికార లెక్కల ప్రకారం ఈ ఏడాది జూన్ 15వ తేదీ నుంచి గత నెల 28 వరకు అన్ని శాఖలకు సంబంధించి ప్రజల నుంచి 8,963 అర్జీలు వచ్చాయి. ఇందులో రెవెన్యూ శాఖకు సంబంధించిన అర్జీలే 3,427 ఉండటం గమనార్హం.

ఉద్యోగుల్లో కలవరం!

రెవెన్యూ సదస్సులు అనే సరికి ప్రధానంగా తహసీల్దారు కార్యాలయ అధికారులు, ఉద్యోగుల్లో కలవరం మొదలైనట్లు తెలిసింది. ప్రజలు తమ సమస్యలను సదస్సు దృష్టికి తీసుకొచ్చే క్రమంలో వీఆర్‌ఓ, ఆర్ఐ, డిప్యూటీ తహసీల్దారు, తహసీల్దారుపై ఫిర్యాదు చేస్తారు. ఏళ్లుగా తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని కొందరు, డబ్బులు అడుగుతున్నారని ఇంకొందరు అధికారులు, ఉద్యోగులపై ఆరోపణలు చేస్తారని రెవెన్యూ వర్గాలే పేర్కొంటున్నాయి. దీంతో సదస్సుల్లో ఎక్కడ తమ బండారం బయట పడుతుందోనని పలువురు ఆందోళన చెందుతున్నట్లు తెలిసింది.

సదస్సుల నిర్వహణ ఇలా...

గ్రామంలో సభ నిర్వహించి కార్యక్రమ లక్ష్యంపై ప్రజలకు అవగాహన కల్పిస్తారు.

- ఫిర్యాదు స్వీకరించి అర్జీదారునికి రసీదు ఇస్తారు. ఆన్‌లైన్ విధానంలో అన్ని ఫిర్యాదులు నమోదు చేస్తారు.
- క్షేత్ర సందర్శనలతో ప్రతి సమస్యపై సమగ్ర విచారణ నిర్వహిస్తారు. సాధ్యమైనంత వరకూ అక్కడికక్కడే పరిష్కరిస్తారు.
- తహసీల్దారు నేతృత్వంలోని బృందం విచారణకు వచ్చే సమయాన్ని ప్రకటిస్తారు.
- గ్రామంలో రీ–సర్వే చేసినట్లయితే, కొత్తగా తయారు చేసిన ఆర్ఓఆర్‌ను గ్రామసభలో చదివి, అభ్యంతరాలు ఏమైనా ఉంటే వాటినీ చదువుతారు.
- కోర్టు కేసులను, ముఖ్యంగా హైకోర్టు కేసులను గుర్తించడానికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించవచ్చు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు వాటిని పరిష్కరిస్తారు.
- గ్రామంలో సర్వే రాళ్లు ఉంటే, లోగోలు, పేర్లను చెరిపివేయవచ్చు.
- గ్రామంలో భూమికి సంబంధించిన వివాదాలు ఉంటే, వాటి పరిష్కారానికి తహసీల్దారు ముందు ఒక ఒప్పందానికి రావాలని సంబంధిత పార్టీలకు సూచించవచ్చు. వివాదాలను సామరస్యంగా పరిష్కరించుకోవడానికి బృందంగా ప్రయత్నం చేయాలి.
- సరిహద్దు వివాదాలు ఉంటే, మండల సర్వేయర్‌ను నియమించి భూమిని సర్వే చేయించి సమస్యను పరిష్కరించాలి.

పకడ్బందీగా నిర్వహించాలి



వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న జేసీ శివ్ నారాయణ శర్మ

అనంతపురం అర్బన్: రెవెన్యూ సదస్సులు పకడ్బందీగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి ఆర్డీఓలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతపురం, కళ్యాణదుర్గం, గుంతకల్లు రెవెన్యూ డివిజన్ పరిధిలోని 32 మండలాలకు సంబంధించి 503 రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు నిర్వహించాలని చెప్పారు. పెద్ద రెవెన్యూ గ్రామం అయితే పూర్తిగా ఒక రోజు, చిన్న రెవెన్యూ గ్రామమైతే సగం రోజు కేటాయించాలన్నారు. షెడ్యూల్‌ను ప్రజాప్రతినిధులకు తెలియజేసి ఆహ్వానించాలని సూచించారు. ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ తిప్పేనాయక్, డిప్యూటీ కలెక్టర్లు ఆనంద్, మల్లికార్జునుడు, కో–ఆర్డినేషన్, భూ పరిపాలన విభాగాల సూపరింటెండెంట్లు యుగేశ్వరి, రియాజుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రశాంతంగా రైల్వే కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికలు



గుంతకల్లులో బారులు తీరిన ఓటర్లు

గుంతకల్లు/గుత్తి: డివిజన్ వ్యాప్తంగా రైల్వే కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికలు బుధవారం ప్రారంభమయ్యాయి. గుంతకల్లు డివిజన్ వ్యాప్తంగా 34 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. గుంతకల్లు ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, వైట్ హౌస్, డీటీటీసీ సెంటర్, రైల్వే ఇన్‌స్టిట్యూట్, అనురాగ్ చర్చిలో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. గుత్తి ఆర్‌ఎస్‌లోని రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో రెండు, కమ్యూనిటీ హాల్‌లో ఒకటి చొప్పున పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. గుంతకల్లులోని 6 పోలింగ్ కేంద్రాల పరిధిలో 4,136 మంది ఓటర్లు ఉండగా సాయంత్రం పోలింగ్ ముగిసే సమయానికి దాదాపు 50 శాతం ఓటింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. గుంతకల్లు డివిజన్ వ్యాప్తంగా పరిశీలిస్తే 14,359 మంది ఓటర్లకు గాను 49.75 శాతంతో 7,143 మంది ఓటు హక్కు వినియోగించుకున్నట్లు తెలిసింది. ఉదయం 8.00 గంటలకు ప్రారంభమైన పోలింగ్ ప్రక్రియ సాయంత్రం 6.00 గంటల వరకు కొనసాగింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

టేబుల్ టెన్నిస్ జట్టు ఎంపిక



ఎంపికైన వారితో ఎస్కేయూ క్రీడాకార్యదర్శి జెస్సీ

అనంతపురం: ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకు తమిళనాడులోని వేలూరులో ఉన్న వేలూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీఐటీ) విశ్వవిద్యాలయం వేదికగా జరిగే దక్షిణ భారత అంతర వర్సిటీ టేబుల్‌టెన్నిస్ టోర్నీలో ప్రాతినిధ్యం వహించే ఎస్కేయూ జట్టును బుధవారం ఎంపిక చేశారు. ఈ మేరకు వర్సిటీ క్రీడాకార్యదర్శి డాక్టర్ బి.జెస్సీ తెలిపారు. ఎంపికైన వారిలో పాలగిరి హర్షవర్ధనరాజు, వి.జనార్ధన, షేక్ మహమ్మద్, ఇలియాజ్, జి.ప్రదీప్‌రెడ్డి ఉన్నారు.

ఆవిష్కరణలు అదుర్స్

- అబ్బుర పరిచిన పాలిటెక్ ఫెస్ట్–2024
- వినూత్న ఆవిష్కరణలతో ఆకట్టుకున్న డిప్లొమా విద్యార్థులు

అనంతపురం: విద్యార్థుల్లో వినూత్న ఆలోచనలు ప్రోత్సహించి, వారిని భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అనంతపురంలోని పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం ప్రారంభమైన రెండు రోజుల రీజనల్ పాలిటెక్ ఫెస్ట్–2024 అద్భుత ఆవిష్కరణలకు కేంద్రంగా మారింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న 17 పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురి ఆవిష్కరణలు ఆకట్టుకున్నాయి. డిప్లొమా స్థాయిలోనే వినూత్న, ఆధునిక ఆవిష్కరణలు ప్రదర్శించిన విద్యార్థుల మేథాసంపత్తిని అధ్యాపకులు అభినందించారు. అబ్బురపరిచే ఆవిష్కరణలపై సర్వత్రా ప్రశంసలు దక్కాయి. విద్యార్థులు ప్రదర్శించిన ఆవిష్కరణల్లో కొన్ని...



నమూనాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

అంధులకు దోహదపడేలా



అంధులు నడిచేటప్పుడు ఎదురుగా ఏదైనా వస్తువు ఉంటే ముందస్తుగా సైరన్ మోగే పాదరక్షలను పీవీకేకే డిప్లొమా విద్యార్థులు రూపకల్పన చేశారు. 'స్మార్ట్ షూస్ ఫర్ బ్లైండ్ పీపుల్ ఆర్ ఇన్నోవేషన్ ఫుట్‌వేర్ డిజైన్డ్ టు అసిస్ట్ ఇండువ్యువల్స్ విత్ విజువల్ ఇంప్లిమెంట్ బై ప్రొవైడింగ్ రియల్ టైం గైడెన్స్' అంశంతో విద్యార్థులు బి.అంజుమ్, డి.జాస్మిన్ సాను, ఎం.యశ్వత, ఎస్.హాసిని ఆవిష్కరించిన ఈ ప్రాజెక్ట్ అబ్బుర పరిచింది. నడిచేటపుడు ఏదైనా ఎదురుగా వస్తే ఐఓటీ సాయంతో ముందస్తుగా సెన్సార్లు యాక్టివేట్ అయి వెంటనే సైరన్ మోగుతుంది. దీంతో అంధులు తమ దిశను మార్చుకుని నడవడానికి దోహదపడతాయి.

శ్రమశక్తి... విద్యుదుత్పత్తి



సాధారణంగా వ్యాయామం చేయడం ద్వారా వృథా అయ్యే శక్తితో విద్యుత్‌ను ఉత్పత్తి చేయవచ్చునని నిరూపించారు అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు. టీఎం ముఫీద్, సింగ్ నేతృత్వంలో రూపకల్పన చేసిన ఈ ప్రాజెక్ట్ పలువురిని ఆలోచింపచేసింది. జిమ్‌లో వ్యాయామం చేసేటప్పుడు వెలువడే శక్తిని విద్యుత్‌గా మార్చి బ్యాటరీలో స్టోరేజ్ చేయడం ద్వారా అవసరమున్నప్పుడు దానిని ఎలా వాడుకోవచ్చో విద్యార్థులు ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. అలాగే మల్టీపర్పస్ షైవింగ్ మెషిన్ అనే అంశంపై ఇదే కళాశాలకు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన ఆవిష్కరణ సైతం ఆకట్టుకుంది.

సమాజాభివృద్ధికి దోహదపడేలా...

సమాజాభివృద్ధికి దోహదపడేలా విద్యార్థుల ఆవిష్కరణలు ఉన్నాయని ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించిన జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ కొనియాడారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్ మొదలు హార్ట్ ట్రాన్స్‌ప్లాంట్ వరకు అన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నారన్నారు. ఇందుకు టెక్నో గ్రాడ్యుయేట్ల కృషి ఫలితంగా రోబోటిక్ సర్జరీలతో వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయన్నారు. కార్యక్రమంలో ఎస్వీయూ రీజియన్ ఆర్జేడీ నిర్మల్‌కుమార్ ప్రియ, టెక్నికల్ ఎడ్యుకేషన్ డిప్యూటీ సెక్రెటరీ వేణుమాధవ్, అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సి.జయచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'సివిల్'లో అద్భుతం



కళ్యాణదుర్గంలోని పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ఎం.సాయిజగదీష్, పి.అర్షిద్, పి.అల్లూరయ్య, పి.యశ్వంత్ సివిల్ ఇంజినీరింగ్‌లో అద్భుతాన్ని ఆవిష్కరించారు. వీరు రూపొందించిన 'కేబుల్ స్టేయిడ్ బ్రిడ్జి, యూజింగ్ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ అండ్ అడ్వాన్స్‌డ్ సాఫ్ట్‌వేర్' ఆవిష్కరణ ఇంజినీరింగ్ నిపుణులను ఆలోచనలో పడేసింది. సాధారణంగా వంద మీటర్ల కంటే ఎక్కువ వెడల్పు ఉన్న నదిపై బ్రిడ్జి నిర్మాణంలో పిల్లర్లను ఎక్కువగా ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అయితే కేవలం రెండు పిల్లర్లతోనే ఈ అసాధ్యాన్ని సుసాధ్యమంటూ వీరు తమ ఆవిష్కరణను ప్రదర్శించారు. లెక్చరర్ ఎం.నరేష్ పర్యవేక్షణలో ఈ ప్రాజెక్ట్‌ను విద్యార్థులు రూపొందించారు. వంతెన పైభాగాన కేబుల్‌తో సపోర్ట్ చేస్తూ ఎక్కువ పిల్లర్లు అవసరం లేకుండా రెండు పలకల రహదారి నిర్మాణాన్ని వివరించి, ఆకట్టుకున్నారు.

అనంత జైలు సూపరింటెండెంట్ సస్పెన్షన్



కిషోర్‌కుమార్

ఆరిలోవ(విశాఖ): విశాఖ కేంద్ర కారాగారంలో పనిచేసి నాలుగు రోజుల క్రితం బదిలీపై వెళ్లిన ఇద్దరు అధికారులను సస్పెండ్ చేస్తూ రాష్ట్ర హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కుమార్ విశ్వజిత్ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. విశాఖ కారాగారంలో ఇటీవల పలు అవాంఛనీయమైన సంఘటనలు చోటుచేసుకున్నాయి. ఆ సమయంలో ఇక్కడ సూపరింటెండెంట్‌గా ఎస్.కిషోర్‌కుమార్, అదనపు సూపరింటెండెంట్‌గా ఎం.వెంకటేశ్వరరావు ఉన్నారు. నాలుగు రోజుల క్రితం బదిలీల్లో భాగంగా ఎస్.కిషోర్‌కుమార్ అనంతపురం ఓపెన్ ఎయిర్ జైల్‌కు, ఎం.వెంకటేశ్వరరావు నెల్లూరు కారాగారానికి వెళ్లారు. కాగా జైల్లో ఘటనలపై ఉన్నతాధికారులు చేపట్టిన విచారణలో జరిగిన పరిణామాలకు వారి నిర్లక్ష్యమే కారణమని నిర్ధారణ అయింది. దీంతో ఇద్దరు అధికారులను సస్పెండ్ చేశారు. విశాఖ కేంద్ర కారాగారంలో జరిగిన సంఘటనలకు సంబంధించి మరికొందరిపై విచారణ జరుగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. విచారణ అనంతరం ఎవరెవరిపైన వేటుపడనుందో వేచి చూడాల్సిందే.

మహిళపై కత్తితో దాడి



చికిత్స పొందుతున్న నజియా

గుత్తి: స్థానిక కమాటం వీధికి చెందిన నజియాపై అదే వీధికి చెందిన దాదా అలియాస్ దాదు కత్తితో దాడి చేశాడు. ఒకే వీధిలో ఉండడంతో ఇద్దరి మధ్య పరిచయం ఉంది. ఈ పరిచయం కారణంగా దాదు ఆమెకు కొంత డబ్బు ఇచ్చాడు. ఇటీవల డబ్బు అవసరం కావడంతో ఆమెను తరచూ అడుగుతూ వచ్చాడు. అయితే కూలి పనులతో జీవనం సాగిస్తున్న ఆమె ఒక్కసారిగా డబ్బు ఇవ్వలేకపోవడంతో కక్ష పెంచుకున్న దాదు... బుధవారం ఉదయం బండగేరిలో కూలి పనికి వెళ్లిన నజియాపై కత్తితో దాడి చేసి నాలుగు సార్లు పొడిచి, పారిపోయాడు. స్థానికులు గమనించి క్షతగాత్రురాలిని వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి వైద్యులు రెఫర్ చేశారు. కాగా, నిందితుడు దాదాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఘటనపై ఎస్ఐ సురేష్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఆర్‌జీఎస్‌ఏ నిధుల వినియోగంపై నేటి నుంచి శిక్షణ

అనంతపురం సిటీ: 'స్థానికీకరణ–సుస్థిర అభివృద్ధి లక్ష్య' సాధనలో భాగంగా రాష్ట్ర గ్రామ స్వరాజ్య అభియాన్(ఆర్‌జీఎస్‌ఏ) నిధుల వినియోగంపై జెడ్పీలోని డీపీఆర్‌సీ భవనంలో గురువారం నుంచి శిక్షణా తరగతులు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు జెడ్పీ సీఈఓ వెంకటసుబ్బయ్య బుధవారం తెలిపారు. శిక్షణ తరగతులకు ముఖ్య అతిథిగా జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ హాజరుకానున్నారు. రెండ్రోజుల పాటు రెండు బ్యాచులకు శిక్షణ ఉంటుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఈఓఆర్‌డీలు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీహెచ్‌ఓలు, ఆర్‌డబ్ల్యూఎస్... పీఆర్ ఏఈలు, మండలానికి ఒకరు చొప్పున ఒక్కో మండలం నుంచి అరుగురు చొప్పున శిక్షణకు హాజరు కావాల్సి ఉంటుంది. శిక్షణ అనంతరం ఆ తర్వాత ఈ నెల 10 నుంచి 19 వరకు మండలాల్లో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులకు, సచివాలయ ఉద్యోగులకు వారు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుంది.

మాల ధరించి... మటన్ తిని!

గార్లదిన్నె: అయ్యప్ప మాల ధరించిన ఓ యువకుడు అపరిచితుల ఇంట్లోకి చొరబడి వారి వండి పెట్టుకున్న మటన్ ఆరగించి, విలువైన బంగారు నగలు, నగదు అపహరించుకెళ్లాడు. గార్లదిన్నె మండలం కోటంకలో ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. కోటంకకు చెందిన రైతు గోవిందరెడ్డి మంగళవారం ఉదయం ఇంటికి తాళం వేసి భార్యతో కలసి పొలానికి వెళ్లాడు. ఆ సమయంలో అయ్యప్ప మాల ధరించిన యువకుడు ఇంట్లోకి చొరబడి వండిపెట్టిన మటన్, ఇతర ఆహార పదార్థాలను తిని, బీరువాలో ఉన్న ఇంటి యాజమాని దుస్తులు ధరించి, అయ్యప్ప దుస్తులు అక్కడే పడేసి బయటకెళ్లాడు. ఆ సమయంలో ఎదురుపడిన గోవిందరెడ్డి తల్లిని బెదిరించి ఉడాయించాడు. పొలం నుంచి ఇంటికి వచ్చిన గోవిందరెడ్డి దంపతులు ఇంటి తలుపులు తీసి ఉండడం గమనించి లోపలకెళ్లి పరిశీలించారు. బీరువాలో దుస్తులు చెల్లాచెదురుగా పడి ఉండడంతో చోరీ జరిగినట్లు నిర్ధారించుకున్నారు. అదే సమయంలో జరిగిన విషయాన్ని తల్లి చెప్పడంతో చెరువు ప్రాంతం వైపు వెళ్లి అక్కడ తచ్చాడుతున్న యువకుడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. విచారణలో తాను దొంగతనం చేయలేదని, ఇంట్లో భోజనం చేసి వచ్చానని అంగీకరించాడు. యువకుడు తెలిపిన ఆధారాలతో అనంతపురంలోని బంధువులకు సమాచారం అందివ్వడంతో యువకుడికి మతిస్థిమితం లేదని వారు తెలిపారు. అయితే బాధితులు మాత్రం రూ.50 వేలు నగదు, 2 తులాల బంగారు నగలు చోరీ జరిగినట్లు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రైలు నుంచి దూకి యువతి ఆత్మహత్య

- మెడిసన్ సీటు రాకపోవడంతో అఘాయిత్యం
- మృతురాలు కర్ణాటకలోని కలబురిగి వాసి



తనూజ(ఫైల్)

రాయదుర్గం టౌన్: వైద్య కళాశాలలో సీటు దక్కకపోవడంతో మనస్తాపం చెంది ఓ యువతి వేగంగా వెళుతున్న రైలు నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు... కర్ణాటకలోని కలబురిగి (గుల్బర్గా) జిల్లా సేడం పట్టణానికి చెందిన కిషోర్‌కుమార్ కుమార్తె తనూజ (20) మంగళవారం ఉదయం చిత్రదుర్గం చేరుకుని అక్కడి వైద్య కళాశాలలో సీటు కోసం ప్రయత్నించింది. అయితే ఆమెకు సీటు దక్కకపోవడంతో అదే రోజు మధ్యాహ్నం బెంగళూరు నుంచి రాయదుర్గం మీదుగా హోస్పేట్‌కు వెళ్లే రైలులో తిరుగు ప్రయాణమైంది. ప్రయాణిస్తూనే తల్లిదండ్రులకు ఫోన్ చేసి తనకు మెడికల్ సీటు దక్కలేదని, జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకుంటున్నట్లుగా తెలిపింది. అప్పటికే మధ్యాహ్నం 1 గంట. రాయదుర్గం శివారులోని పైతోట సమీపంలో వేగంగా వెళుతున్న రైలు నుంచి కిందకు దూకింది. ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. అయితే కుమార్తె ఫోన్ కాల్‌తో ఆందోళనకు గురైన తల్లిదండ్రులు పలుమార్లు కాల్ చేసినా ఆమె లిఫ్ట్ చేయకపోవడంతో విషయాన్ని వెంటనే కర్ణాటక పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో తనూజ సెల్‌ఫోన్ నంబర్ ఆధారంగా ఆమె ఆచూకీ కోసం కర్ణాటక పోలీసులు గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం పైతోట వద్ద గ్యాంగ్‌మెన్ నగేష్... పట్టాలు పక్కనే పడి ఉన్న యువతి మృతదేహాన్ని గుర్తించి సమాచారం ఇవ్వడంతో గుంతకల్లు జీఆర్పీ ఎస్ఐ మహేంద్ర, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతురాలి వద్ద లభించిన ఆధారాలను పరిశీలించి తనూజగా నిర్ధారించారు. అక్కడే పడి ఉన్న ఫోన్‌లోని నంబర్‌కు కాల్ చేసి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. కుమార్తె మృతి విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, బంధువులు రాయదుర్గానికి ప్రయాణమైనట్లు సమాచారం. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వ్యాసరచన పోటీలకు ఎంట్రీల ఆహ్వానం

అనంతపురం కల్చరల్: భీమవరానికి చెందిన ఉమర్ ఆలీషా సాహితీ సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు నిర్వాహకులు త్సవటపల్లి మురళీకృష్ణ, డాక్టర్ దాయన చంద్రాజీ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సాంఘిక దురాచారాలను రూపుమాపేలా, మత సామరస్యంపై చైతన్య పరుస్తూ డాక్టర్ ఉమర్ ఆలీషా రచించిన 'బర్ధిణీదేవి' కావ్యాన్ని విశ్లేషిస్తూ వ్యాసాలను రచించి ఈ నెల 20వ తేదీ లోపు 'డాక్టర్ ఉమర్ ఆలీషా సాహితీ సమితి, డోర్ నం. 19–22–6, బ్యాంకు కాలనీ, భీమవరం –534201' చిరునామాకు పంపాలి. విజేతలకు జనవరి 23న భీమవరంలో జరిగే సాహితీ కార్యక్రమంలో ప్రశంసాపత్రాలను నవమ పీఠాధిపతుల చేతుల మీదుగా అందిచనున్నారు. పూర్తి వివరాలకు 99894 87098, 94419 83007లో సంప్రదించవచ్చు.

వేర్వేరు కేసుల్లో ముగ్గురు దొంగల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాస్

గుంతకల్లు రూరల్: వరుస చోరీలతో గుంతకల్లు వాసులకు కంటి మీద కునుకు దూరం చేసిన ముగ్గురు యువకులను కసాపురం పోలీసులు అరెస్ట్ చేశారు. కసాపురం పీఎస్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను డీఎస్పీ శ్రీనివాస్, సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ వెంకటస్వామి వెల్లడించారు. బుధవారం సాయంత్రం డీఆర్ఎం కార్యాలయం సమీపంలోని భవానీ ఆలయం వద్ద అనుమానాస్పదంగా తచ్చాడుతున్న స్థానిక ఉమామహేశ్వర నగర్‌కు చెందిన షెక్షావలిని పోలీసులు అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో ప్రశ్నించారు. దీంతో తన తమ్ముడు మస్తాన్‌తో కలసి కసాపురం పీఎస్ పరిధిలో రెండు, గుంతకల్లు వన్‌టౌన్ పీఎస్ పరిధిలో మరో రెండు దొంగతనాలకు పాల్పడినట్లు షెక్షావలి అంగీకరించాడు. దీంతో అతని నుంచి రూ.7 లక్షల విలువ చేసే 10 తులాల బంగారు నగలు, చోరీకి ఉపయోగించిన ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న మస్తాన్ కోసం గాలింపు చేపట్టారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.

ద్విచక్ర వాహనాల దొంగల అరెస్ట్

ద్విచక్ర వాహనాలను అపహరిస్తున్న గుంతకల్లు మండలం నెలగొండ గ్రామానికి చెందిన హేమంత్‌కుమార్, గుంతకల్లులోని ఉమామహేశ్వరనగర్‌కు చెందిన బి.వంశీని పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం మధ్యాహ్నం ఫక్కీరప్ప కాలనీ వద్ద ఉన్న శివాలయం వద్ద నిందితులు పట్టుబడ్డారు. వీరి నుంచి 9 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.

టీడీపీ నేత నిర్బంధం నుంచి మా అమ్మను కాపాడండి

- వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ జావీద్‌ఖాద్రీ విజ్ఞప్తి



తాడిపత్రి టౌన్: టీడీపీ నేత నిర్బంధంలో ఉన్న తన తల్లిని విడిపించాలని తాడిపత్రి పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ జావీద్‌ఖాద్రీ విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని తన కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత తాడిపత్రిలోని టీడీపీ నాయకుల బెదిరింపులతో తాను అజ్ఞాతంలోకి వెళ్లినట్లు గుర్తు చేశారు. అయితే గతంలో తాడిపత్రికి చెందిన గోరా అనే వ్యక్తితో కలసి ట్రాన్స్‌పోర్ట్ వ్యాపారం చేస్తుండేవాడనన్నారు. ఈ క్రమంలో లావాదేవీల్లో తనకు డబ్బు బాకీ పడ్డానంటూ గోరా బెదిరింపులకు దిగాడన్నారు. అంతటితో ఆగకుండా మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకరరెడ్డి అండ చూసుకుని తనపై దౌర్జన్యాలకు, బెదిరింపులకు దిగడంతో అజ్ఞాతంలోకి వెళ్లాల్సి వచ్చిందన్నారు. అయితే తాను వ్యాపారంలో మోసం చేసి ఉంటే 11 లారీలతో ప్రారంభించిన వ్యాపారంలో ఈ మూడేళ్లలోనే 70 లారీలను ఎలా కొనుగోలు చేశాడో చెప్పాలంటూ గోరాని డిమాండ్ చేశారు. వ్యాపార లావాదేవీలకు సంబంధించిన బిల్లులు, అడ్వాన్సులు పరిశీలించినా ఎలాంటి మోసం జరగలేదని తెలుస్తుందన్నారు. కావాలనే తనను తాడిపత్రికి రప్పించేందుకు ఇంట్లో ఒంటరిగా ఉన్న తన తల్లిని నిర్బంధించి చుట్టూ తన మనుషులను గోరా కాపాలపెట్టాడన్నారు. నిత్యావసర సరుకులు కొనుగోలుకు సైతం తల్లిని బయటకు రానివ్వకుండా అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గోరా దౌర్జన్యాలనుంచి తనకు రక్షణ కల్పించడంతో పాటు, అతడి నిర్బంధంలో ఉన్న తల్లిని విడిపించాలని కోరారు.

చిత్రం.. కీర్తి పతాకం

- రాయలసీమ సంస్కృతికి అద్దం పట్టేలా పెయింటింగ్స్
- జాతీయ స్థాయి అవార్డులు అందుకుంటున్న గంప మల్లయ్య

రాయలసీమ సంస్కృతీ సంప్రదాయాలు.. ఆచార వ్యవహారాలు.. కాలగర్భంలో కలిసిపోతున్న తిరునాళ్లు ఆయన కుంచె నుంచి అద్భుత చిత్రాలై జాలువారుతాయి. ఒక్కసారి చూస్తే చాలు కళ్లకు కట్టినట్లు కాన్వాస్‌పై చిత్రీకరించే అతని ప్రతిభ పలువురి చేత శభాష్ అనిపించుకుంటోంది. ఆ అపురూప చిత్రకారుడే బీరే గంప మల్లయ్య. చిరుప్రాయం నుంచి చిత్ర కళ పట్ల పెంచుకున్న మక్కువ ఆయనను జాతీయ స్థాయికి ఎదిగేలా చేసింది.

అనంతపురం కల్చరల్: పామిడి మండలం సొరకాయలపేట గ్రామానికి చెందిన బీరే తాతయ్య, లక్ష్మీదేవి దంపతులకు ఎలాంటి స్థిర, చరాస్తులు లేవు. వ్యవసాయ కూలీలుగా జీవనం సాగిస్తూ తమ కుమారుడు గంప మల్లయ్యను చదివించి ప్రయోజకుడిని చేశారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థిగా ఉన్న సమయంలోనే మల్లయ్యలోని కళాకారుడిని ఆ పాఠశాల ఉపాధ్యాయుడు ఎల్ఆర్ వెంకటరమణ గుర్తించారు. స్వతహాగా అద్భుత చిత్రకారుడైన ఎల్ఆర్ వెంకటరమణ ప్రత్యేక చొరవ తీసుకుని చిత్రాలు గీయడంలో ఓనమాలు నేర్పాడు. విద్యార్థి దశలోనే జిల్లా, రాష్ట్ర స్థాయి చిత్రలేఖన పోటీల్లో పాల్గొని ప్రశంసలు అందుకున్నాడు. ఎల్ఆర్ వెంకటరమణ బదిలీ అనంతరం ప్రోత్సాహం కరువైంది. ఇంటర్ పూర్తి అయ్యే వరకూ ఓ అనామకుడిగానే మిగిలిపోయాడు. ఆ తర్వాత మిత్రుల సహకారంతో యోగి వేమన యూనివర్సిటీలో బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ (బీఎఫ్ఏ)లో చేరి నాలుగేళ్లలో తనలోని కళాకారుడిని ఈ ప్రపంచానికి పరిచయం చేశాడు.

ప్రతి చిత్రమూ బంగారు పతకమే...

- బాల్యంలో పెన్సిల్ డ్రాయింగ్ పెయింటింగ్, క్లే మౌల్డింగ్ తదితర వాటిల్లో ప్రతిభ చాటిన గంప మల్లయ్య 2007లో కోనసీమ చిత్రకళాపరిషత్తు ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో ప్రథమ స్థానం దక్కించుకున్నాడు.
- 2022లో ఆజాదీ కా అమృత మహోత్సవ్‌లో భాగంగా యువ ప్రతిభ టాలెంట్ హబ్‌లో పాల్గొని గోల్డ్ మెడల్ సాధించుకున్నాడు.
- తిరుపతి మహిళా యూనివర్సిటీ వేదికగా జరిగిన నాలుగు రాష్ట్రాల పోటీల్లో పాల్గొని మరో బంగారు పతకాన్ని అందుకున్నాడు. ఈ సందర్భంగా ఆయనకు రాజారవివర్మ అవార్డును నిర్వాహకులు అందజేశారు.
- 2023లో విజేతగా నిలిచి బెంగళూరులో జరిగిన నేషనల్ ఆర్ట్ ఫెస్టివల్‌లోనూ రూ.10 వేల నగదు బహుమతిని, బంగారు పతకాన్ని దక్కించుకున్నాడు.
- 2023లో రాయలసీమ సాంస్కృతిక వేదిక నిర్వహించిన పోటీల్లోనూ విజేతగా నిలిచాడు.
- అన్నింటి కన్నా ముఖ్యంగా గతేడాది సీమ సంస్కృతిని దేశ వాసులకు పరిచయం చేస్తూ లలితా అకాడమీ ఆధ్వర్యంలో న్యూఢిల్లీ వేదికగా జరిగిన పోటీలలో ప్రథమ స్థానంలో నిలిచి అందరి మన్ననలందుకున్నాడు.
- రంగోళి, ఆయిల్ పెయింటింగ్, స్క్రిబుల్ ఆర్ట్, పోర్ట్రెయిట్ ఆర్ట్, సినీ పోస్టర్ మేకింగ్ తదితర వాటిల్లో అపార ప్రతిభ ఉన్న మల్లయ్య... పలు ఆర్ట్ ఎగ్జిబిషన్లలో తన పెయింటింగ్స్‌ను ప్రదర్శించి ఇతర రాష్ట్రాల వారినీ మెప్పిస్తున్నాడు.



గంప మల్లయ్య కుంచె నుంచి జాలువారిన పల్లె సంస్కృతికి అద్దం పట్టే చిత్రం

సీమ సంస్కృతిని పరిచయం చేయడమే లక్ష్యం



రాయలసీమలోని అనేక గ్రామాల్లో పండుగలు, జాతరలు, తిరునాళ్ల గురించి మా తరం వారికి తెలిసింది చాలా తక్కువ. అమ్మ, నాన్న ప్రోత్సాహంతో వీటిపై అవగాహన పెంచుకున్న నేను... పూర్తి స్థాయిలో అధ్యయనం చేసిన తర్వాత కాన్వాస్‌పై చిత్రీకరిస్తూ వస్తున్నా. నా ప్రదర్శనల్లో అదే నాకు బహుమతులు తెచ్చి పెట్టాయి. పక్క రాష్ట్రంలో మంచి ఉద్యోగం వచ్చింది. అయినా జిల్లాపై మమకారంతో వెళ్లకుండా ఇక్కడే ఓ ప్రైవేటు స్కూల్‌లో ఆర్ట్ మాస్టర్‌గా పనిచేస్తున్నా. సీమ ఉద్యమాలు, సంస్కృతి, వేషభాషల ప్రత్యేకతను చిత్రాల రూపంలో విస్తృ ప్రచారం చేస్తా. కళను కమర్షియల్ చేసుకోవడం నాకు ఇష్టం లేదు. – బీరే గంపమల్లయ్య, చిత్రకారుడు

క్లుప్తంగా

నేడు కార్మికశాఖ మంత్రి రాక

అనంతపురం అర్బన్: రాష్ట్ర కార్మిక, పరిశ్రమల శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ గురువారం జిల్లాకు విచ్చేయనున్నారు. తెల్లవారుజామున 3:30 గంటలకు అనంతపురం చేరుకుని ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో విడిది చేస్తారు. ఉదయం 7:30 గంటలకు ఇక్కడి నుంచి పెనుకొండలోని కియా మోటార్స్ పరిశ్రమకు వెళ్తారు. మధ్యాహ్నం 1:30 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 3:30 గంటలకు అనంతపురం చేరుకుంటారు. కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహిస్తారు. అర్ధరాత్రి 12:30 గంటలకు ఇక్కడి నుంచి బయలుదేరి తిరుపతికి వెళతారు.

మోసం చేసిన వారిని శిక్షించాలి


ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

రాప్తాడు రూరల్: అనంతపురం రూరల్ మండలం ఉప్పరపల్లి సమీపంలో పేదలకు నకిలీ పట్టాలిప్పిస్తామని మోసం చేసిన వారిని వెంటనే శిక్షించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం అనంతపురం రూరల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. సీపీఐ నగర కార్యదర్శి శ్రీరాములు మాట్లాడుతూ.. ఉప్పరపల్లి పొలం 194-8 సర్వే నంబర్ 215లో నకిలీ పట్టాలు సృష్టించి ఏకంగా తహసీల్దార్ సంతకాలు, సీల్‌ను ముద్రించిన కురుగంట గ్రామానికి చెందిన ఎస్.నాగభూషణం, ఈడిగ వెంకటేష్‌ను తక్షణం అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. దాదాపు 200 మంది పేదలతో వేల రూపాయలు వసూలు చేసిన నకిలీ పట్టాలిచ్చారన్నారు. తహశీల్దార్ నకిలీ పట్టాల ఫోర్జరీపై పోలీసులు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు దారితీస్తోందన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ, పోలీసు అధికారులు ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ సహాయ కార్యదర్శి రమణ, సంతోష్, నాయకులు ప్రసాద్ సుందర్‌రాజు, జయలక్ష్మి, చాంద్ బాషా, మున్నా, ఖాజా పాల్గొన్నారు.

బాలుర ఐటీఐలో స్కిల్ హవర్

అనంతపురం ఎడ్యుకేషన్: నైపుణ్యాలు పెంపొందించుకోవడం ద్వారా ఏ రంగంలోనైనా అభివృద్ధి సాధిస్తారని జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ బాలుర ఐటీఐలో స్కిల్ హవర్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనం అలవరుచుకున్న అలవాట్లే మన జీవితాన్ని నిర్ణయిస్తాయన్నారు. ఐటీఐ ప్రిన్సిపాల్ రామమూర్తి మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించాలనే లక్ష్యంతో ప్రతి బుధవారం స్కిల్ హవర్ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఐటీఐలో అన్ని ట్రేడ్‌ల విద్యార్థులకు గంటపాటు నిపుణులు అవగాహన కల్పిస్తారన్నారు.

రోశయ్యకు ఘన నివాళి


రోశయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్యులు

అనంతపురం టవర్‌క్లాక్: గుంటూరు జిల్లాకు మాజీ ముఖ్యమంత్రి రోశయ్య పేరు పెట్టాలని ఆర్యవైశ్య కొత్తూరు అమ్మవారిశాల అధ్యక్షుడు మచ్చా నరసింహులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఆర్యవైశ్య కొత్తూరు అమ్మవారిశాలలో రోశయ్య వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 16 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన వ్యక్తి కేవలం రోశయ్య ఒక్కరే అన్నారు. రాజకీయంగా ఆయన చేసిన సేవలు మరువరానివన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు శిరిగుప్ప వెంకటేశ్వర్లు, మనోజ్, ఆదిశేషయ్య, నాగభూషణం, మురళి, సతీష్, రఘు, కిషోర్, సూర్యప్రకాష్, జయంతి సురేష్, వెంకటేశ్వర్లు, కలవల సతీష్, సుకుమార్, సత్రసాల మంజునాథ్, వెంకట కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో..

రోశయ్యను యువత ఆదర్శంగా తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి అన్నారు. ఎన్టీఆర్ మార్గ్‌లోని రోశయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కోటా సత్యనారాయణ, శంకర్ యాదవ్, ఇమామ్, శివారెడ్డి, నరసింహారెడ్డి, నిశాంత్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దార్ల బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు


గంప మల్లయ్య

అనంతపురం కల్చరల్: జిల్లాకు చెందిన చిత్రకారుడు గంప మల్లయ్య మరో రికార్డును సాధించుకున్నాడు. కళా ప్రస్థానంలో అనంత ఖ్యాతిని చాటుతూ అవార్డులందుకున్న మల్లయ్యకు దార్ల బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు కల్పిస్తున్నట్లు వ్యవస్థాపకులు డాక్టర్ దార్ల నాగేశ్వర రావు, డైరెక్టర్ శ్రవణ్ బుధవారం వివరాలు వెల్లడించారు. ఈనెల 8న హైదరాబాద్‌లో ప్రముఖుల చేతుల మీదుగా అవార్డు, సత్కారాన్ని అందుకోనున్నారు. రాయలసీమ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు ప్రతిబింబించే పెయింటింగ్స్ జాతీయస్థాయి చిత్రకారులను ఆకర్షించాయన్నారు.

తూకాల్లో మోసం



రేషన్ షాపుల్లో 20 కేజీలకు 17 కేజీలు, 15 కేజీలకు 12 కేజీలు, 10 కేజీలకు 8 కేజీలు అంటగడుతున్న వైనం

- అనంతపురం రూరల్ పాపంపేటలో రేషన్‌షాపులో వెలుగుచూసిన అక్రమాలు
- లబోదిబోమంటున్న లబ్ధిదారులు
- పట్టించుకోని పౌరసరఫరాల అధికారులు

రాప్తాడు రూరల్: కూటమి ప్రభుత్వం వచ్చాక రేషన్ షాపు తూకాల్లో మోసాలు జరుగుతున్నాయి. లబ్ధిదారులకు తెలియకుండా తూకాల్లో తక్కువ వేస్తున్నారు. ఇది తెలియని ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారు. పాపంపేట పరిధిలో ఉన్న వివిధ రేషన్‌షాపుల్లో ఇదే రకంగా మోసాలు చేస్తున్నారంటూ లబ్ధిదారులు వాపోతున్నారు. ఇష్టానుసారంగా తూకాలు వేస్తూ అంటగడుతున్నారని మండిపడుతున్నారు. అలాగే తూకం మిషన్ కూడా తమకు కనిపించకుండా పెడుతున్నారని చెబుతున్నారు. గట్టిగా అడిగితే గొడవలకు వస్తున్నారని.. రేషన్ షాపు బంద్ చేసి బియ్యం అయిపోయాంటున్నారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని రకాల వస్తువులు బలవంతంగా అంట గడుతున్నారు. ఒకట్రెండు రోజులు మాత్రమే సరుకులు వేస్తూ షాపులు బంద్ చేస్తూ.. లబ్ధిదారులను ముప్పుతిప్పలు పెడుతున్నారు. సరుకులన్నీ అయిపోయంటూ రేషన్ దుకాణాలను మూసేస్తున్నారు. రేషన్ డీలర్లు ఇంతగా ఇబ్బందులు పెడుతున్నా పౌరసరఫరాల అధికారులు, రెవెన్యూ అధికారులు రేషన్‌షాపుల వైపునకు కన్నెత్తి చూడడం లేదు. ఈ కారణంగా కొందరు డీలర్లు బరితెగించి లబ్ధిదారులకు ఎగ్గొట్టి రేషన్‌ను బ్లాక్‌మార్కెట్‌కు తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.


నాగలక్ష్మి

ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు నాగలక్ష్మి. అనంతపురం రూరల్ మండలం విద్యారణ్య నగర్ ఉర్దూ స్కూల్ సమీపంలో నివాసం ఉంటోంది. బుధవారం రేషన్‌షాపుకు వెళ్లగా 15 కేజీల బియ్యం వేశారు. నాగలక్ష్మికి తూకంలో అనుమానం వచ్చి ఓ దుకాణం వద్ద తూకం వేయించింది. కేవలం 10.5 కేజీలు ఉన్నట్లు తేలడంతో విస్తుపోయింది. దీంతో నాగలక్ష్మి సదరు రేషన్‌షాపు వద్దకు వెళ్లి డీలర్‌ను గట్టిగా నిలదీసింది. గట్టిగా అరవొద్దంటూ చెప్పిన డీలర్.. రెండు కేజీల జొన్నలు ఇచ్చి పంపారు. అయినా లబ్ధిదారురాలు ఇంకా రెండున్నర కేజీల బియ్యం నష్టపోవాల్సి వచ్చింది. ఈమె కోడలు జ్యోతికి కూడా రెండు కేజీల బియ్యం తక్కువ వేశారు. సూరమ్మ అనే మహిళకు 10 కేజీలకు గాను 8 కేజీలు, గౌతమి అనే మహిళకు 15 కేజీలకు గాను 12.5 కేజీలు, మరో మహిళకు 20 కేజీలకు గాను 17.3 కేజీల బియ్యం ఇచ్చారని లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు.



20 కేజీలకు గాను 17.385 కేజీలు ఇచ్చిన బియ్యం

లబ్ధిదారులు నష్టపోకూడదు

“ ఎట్టి పరిస్థితుల్లోనూ తూకాలు తక్కువ ఉండకూడదు. కార్డుకు కేటాయించిన ప్రకారం ఇవ్వాల్సిన బాధ్యత డీలర్లదే. ఏ ఒక్క లబ్ధిదారూ నష్టపోకూడదు. రూరల్ మండల పరిధిలో ఏ రేషన్‌షాపులోనైనా తక్కువ తూకాలు వేస్తున్నట్లు గుర్తిస్తే నేరుగా లబ్ధిదారులకు తనకు (మొబైల్ నంబర్ 98490 38928) ఫిర్యాదు చేయొచ్చు. కచ్చితంగా విచారించి చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా వ్యవహరిస్తే కేసులు నమోదు చేయిస్తాం.

– ఇంతియాజ్ అహమ్మద్, సీఎస్‌డీటీ

ముందస్తు అడ్మిషన్లు చేపడితే కఠిన చర్యలు

అనంతపురం ఎడ్యుకేషన్: కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి ముందస్తుగా అడ్మిషన్లు చేపడితే కఠిన చర్యలు తప్పవని ఇంటర్‌బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి (ఆర్‌ఐఓ) వెంకటరమణనాయక్ హెచ్చరించారు. బుధవారం అనంతపురంలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలను ఆయన తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌ఐఓ మాట్లాడుతూ... వచ్చే విద్యాసంవత్సరానికి సంబంధించి అడ్మిషన్లపై ప్రభుత్వం ఎలాంటి షెడ్యూలు విడుదల చేయలేదన్నారు. అయితే కొన్ని కళాశాలలు ఇప్పటి నుంచే అడ్మిషన్లు చేపడుతున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. మరికొన్ని కళాశాలలు ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిసిందన్నారు. ముందస్తు అడ్మిషన్లుకాని, ప్రవేశ పరీక్షలు నిర్వహించినా చర్యలు తప్పవన్నారు. 2025 మార్చిలో జరిగే ఇంటర్ వార్షిక పరీక్షలకు సంబంధించి మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు, ఫెయిలైన విద్యార్థులు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా గురువారం (నేడు) సాయంత్రం లోపు ఫీజు చెల్లించవచ్చన్నారు. 2025 ఫిబ్రవరి మొదటి వారంలో ప్రాక్టికల్ పరీక్షలు ఉంటాయన్నారు. జనవరి 31లోపు సిలబస్ పూర్తి చేసి, విద్యార్థులకు అన్ని ప్రయోగాలు పూర్తవ్వాలన్నారు. రికార్డులు సర్టిఫై చేయించుకోవాలన్నారు. అన్ని యాజమాన్యాల కళాశాలల ప్రిన్సిపాళ్లు చొరవ తీసుకోవాలని ఆదేశించారు.


శ్రీచైతన్య కళాశాలలో రికార్డులు పరిశీలిస్తున్న ఆర్‌ఐఓ వెంకటరమణ నాయక్

విద్యార్థికి ఆర్‌ఐఓ అభినందన

అనంతపురం ఎడ్యుకేషన్: ఇటీవల నంద్యాలలో ఎస్జీఎస్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి స్పోర్ట్స్‌మీట్ ఫెన్సింగ్ సబార్ విభాగంలో సత్తాచాటి గోల్డ్‌మెడల్ సాధించిన నగరంలోని శ్రీవికాస్ జూనియర్ కళాశాల విద్యార్థి గొట్టుముక్కల శేషసాయిని ఇంటర్ బోర్డ్ ఆర్‌ఐఓ వెంకటరమణ నాయక్ అభినందించారు. బుధవారం విద్యార్థి, కళాశాల యాజమాన్యం ఆర్‌ఐఓను కలిశారు. ఈనెల 17 నుంచి 21 వరకు బీహార్ రాష్ట్రంలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో శేషసాయి పాల్గొంటాడని వికాస్ కళాశాల డైరెక్టర్లు కె.జయభాస్కర్, కె.సుబ్రహ్మణ్యం తెలిపారు. జాతీయస్థాయి పోటీల్లోనూ ప్రతిభ చాటి జిల్లాకు మంచిపేరు తేవాలని ఆర్‌ఐఓ ఆకాంక్షించారు.

నగరపాలక సంస్థ స్థలాలను పరిరక్షిస్తాం

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థకు చెందిన ఓపెన్‌సైట్లలో పార్కులను అభివృద్ధి చేసి, స్థలాలను పరిరక్షించేలా చర్యలు తీసుకుంటామని మేయర్ వసీం పేర్కొన్నారు. బుధవారం 39వ డివిజన్‌లో పార్క్ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న ఓపెన్ సైట్లు అన్యాక్రాంతం కాకుండా ప్రహరీల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. స్థానిక ఆనంద్ అపార్ట్‌మెంట్ వెనుక వైపు ఉన్న 30 సెంట్ల ఓపెన్ సైట్‌కు ఇటీవల నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.21 లక్షలు వెచ్చించి ప్రహరీ నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ప్రస్తుతం లెవలింగ్ పనులను చేపడుతున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా ఇక్కడ హైమాస్ లైట్లు, వాకింగ్ ట్రాక్, పిల్లలు ఆడుకునే పరికరాల ఏర్పాటుకు అంచనాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. త్వరితగతిన ఆయా పనులు పూర్తి చేసి పార్కును ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో ఈఈ రాధాకృష్ణ, ఏఈ హరీష్, కార్పొరేటర్ కమల్‌భూషణ్, వైఎస్సార్‌సీపీ నాయకులు చింతకుంట మధు, కాకర్ల శీన తదితరులు పాల్గొన్నారు.


అధికారులకు సూచనలిస్తున్న మేయర్ వసీం

సీపీఐ నాయకుల నుంచి రక్షణ కల్పించాలి

అనంతపురం టవర్‌క్లాక్: ఉప్పరపల్లి పంచాయతీ దామోదర సంజీవయ్య కాలనీలో గుడిసెలు వేసుకుని జీవిస్తుంటే సీపీఐ నాయకులు శ్రీరాములు, రమణయ్య వారి అనుచరులతో దాడి చేయించారు. వీరి నుంచి రక్షణ కల్పించాలని కాలనీవాసులు కోరారు. బుధవారం స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగభూషణ మాట్లాడుతూ.. కొంతకాలంగా ఉప్పరపల్లి పంచాయతీలో గుడిసెలు వేసుకున్నామన్నారు. సీపీఐకి చేందిన శ్రీరాములు, రమణయ్య దౌర్జన్యంగా 300 మంది గుండాలు, రౌడీలతో వచ్చి దాడి చేశారని పేర్కొన్నారు. వారి నుంచి మాకు ప్రాణహాని ఉందన్నారు. ఈ విషయంపై ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. మా గుడిసెలపై జెండాలు పెట్టి భయాందళనకు గురి చేస్తున్నారన్నారు. వెంటనే పోలీసులు చొరవ తీసుకుని శ్రీరాములు, రమణయ్యతో పాటు దాడికి పాల్పడిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. వీరిని సీపీఐ నుంచి తొలగించాలన్నారు. కార్యక్రమంలో రామాంజనేయులు, పాండురంగ, భానుప్రకాష్, లక్ష్మన్న, సుమన్, చిరంజీవి, సుమతి, రాధిక, విజయలక్ష్మి, శివ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కాలనీవాసులు

ఉపాధ్యాయులపై ఆంక్షలు దుర్మార్గం

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యాశాఖ అధికారులు తీసుకుంటున్న అసంబద్ధ నిర్ణయాలను వెంటనే రద్దు చేయాలని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం డీఈఓ ప్రసాద్ బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య మాట్లాడుతూ.. పాఠశాలల పని వేళల పెంపు, 10 శాతం మించి ఉపాధ్యాయులు సెలవులు పెట్టరాదనే ఆంక్షలు పెట్టడం దుర్మార్గమన్నారు. పదో తరగతి పరీక్షలకు సంసిద్ధత పేరుతో 100 రోజుల యాక్షన్ ప్లాన్ అమలు చేస్తున్నారన్నారు. సిలబస్ పూర్తికాక విద్యార్థులు, ఉపాధ్యాయులు అయోమయంలో ఉన్నారని వాపోయారు. రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప మాట్లాడుతూ.. అపార్ నమోదు తల్లిదండ్రులకు గుదిబండగా మారిందన్నారు. విద్యాశాఖ తీసుకుంటున్న ప్రతి నిర్ణయం అసంబద్ధంగానే ఉంటోందన్నారు. అత్యవసర సందర్భాల్లోనూ సెలవులు మంజూరు చేయకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. నిర్ణయాలను రద్దు చేయకుంటే ఈనెల 11న డీఈఓ ఆఫీస్ ఎదుట ధర్నా చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ గౌరవ అధ్యక్షులు రమణయ్య, నాయకులు సరళ, సుబ్బరాయుడు, చంద్రమోహన్, దేవేంద్రమ్మ, ఆదిశేషయ్య, శ్రీనివాసులు, సిద్ధన్న, సంపత్ కుమార్ పాల్గొన్నారు.


డీఈఓ ప్రసాద్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఘంటసాలకు స్వరనీరాజనం

అనంతపురం కల్చరల్: అమర గాయకుడు ఘంటసాల 102వ జయంతిని జిల్లా కళాకారులు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డు రాజీవ్ పార్కులో ఏర్పాటు చేసిన విగ్రహానికి గాయకులు పూలమాలలతో నివాళులర్పించారు. పద్మశ్రీ ఘంటసాల సంగీత సాంస్కృతిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో మధ్యాహ్నం ఘంటసాల పేరు మీద వృద్ధాశ్రమాల్లో అన్నదానం చేశారు. సాయంత్రం స్మారక విగ్రహం వద్ద సీనియర్ గాయకులు పాలసముద్రం నాగరాజు, డాక్టర్ జగర్లపూడి శ్యామసుందర శాస్త్రి, ఆచార్య సుధాకర బాబు, కేవీ మహీధర్, వాణి, విజయరాఘవన్ తదితరులు గీతాలతో ఆకట్టుకున్నారు. నిర్వాహకులు జీవీ రామయ్య, ఓబుళదాసు తదితరులు మాట్లాడుతూ.. మరే గాయకుడికి లేనన్ని విగ్రహాలు ఘంటసాలకు దేశంలో 55 పైన ఉండటం విశేషమన్నారు. అందులో నగరంలో భ్రమణ పద్ధతిలో స్మారక విగ్రహాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. ఔత్సాహిక గాయనీ గాయకులకు అవకాశం కల్పించే వేదికగా ట్రస్టును మార్చామని గుర్తు చేశారు. కార్యక్రమంలో కళాకారులు కేశవ, నరసింహులు, రమణ, చలపతి, బృంద పాల్గొన్నారు.

లలిత కళాపరిషత్తులో..

ఘంటసాల వంటి మధుర గాయకుడు మళ్లీ పుట్టబోడని పలువురు వక్తలు అన్నారు. ఘంటసాల జయంతి సందర్భంగా లలితకళాపరిషత్తులో సంగీత విభావరి జరిగింది. నన్ను దోచకుందువటే.. విన్నానులే ప్రియా..వాడిన పూలే వికసించులే వంటి పాటలను ఎల్కేపి కార్యదర్శి గాజుల పద్మజ, ఆచార్య సుధాకరబాబు పాడిన తీరు అందరిని అమితంగా ఆకట్టుకుంది. అంతకు ముందు ఘంటసాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎల్కేపీ కార్యవర్గ ప్రతినిధులు, సీనియర్ కళాకారులు సంగాల నారాయణస్వామి, రామగోవిందు, ఆనంద్, రాజకుళ్లాయప్ప, వెంకటరామిరెడ్డి, అస్లాంబాష, లోకేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


ఘంటసాల విగ్రహానికి నివాళులర్పిస్తున్న గాయకులు

కాంప్లెక్స్ సమస్య పరిష్కరించాలి

అనంతపురం కల్చరల్: నగరంలోని ఈద్గా మసీదు కాంప్లెక్స్ సమస్యను పరిష్కరించడంలో అధికారులు పారదర్శకతను పాటించకుండా కేవలం ఒకరిద్దరు చెప్పింది వేదం అన్నట్లు వెళ్లిపోవడం విచారకరమని ఇన్సాఫ్ ప్రతినిధులు అన్నారు. బుధవారం భారత కమ్యూనిస్టు పార్టీ అనుబంధ సంస్థ అయిన ఇన్సాఫ్ కార్యాలయంలో నగర ప్రధాన కార్యదర్శి ఖాజా హుస్సేన్ సంస్థ గౌరవాధ్యక్షుడు అల్లీపీరా, అధ్యక్షుడు చాంద్‌బాషా విలేకరులతో మాట్లాడారు. గతంలో అధికారులు, ప్రజాప్రతినిధులు కాంప్లెక్స్ విషయంలో అందరికీ న్యాయం చేస్తామన్నారు. ఇటీవల ఈద్గా మసీదుకు వచ్చిన అధికారులు అందరితో మాట్లాడతారని చెప్పగానే వందలాది మందిలో కాంప్లెక్స్‌లో ఉంటున్నవారే కాకుండా వివిధ సంఘాల నాయకులు, ముతవల్లీలు గంటల తరబడి వేచిచూశారన్నారు. అయితే కొందరిని పిలుపించుకుని ఎవరేమి మాట్లాడారో తెలియకుండా వెళ్లిపోవడం సబబు కాదని విమర్శించారు. ఏకపక్ష నిర్ణయాలకు తావు లేకుండా అందరి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకునేలా కలెక్టర్ చొరవ తీసుకోవాలని కోరారు. పారదర్శకత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో హాజీవలి, రహంతుల్లా, ఖాజామొహిద్దీన్, దాదు పాల్గొన్నారు.

హిందువులపై దాడులు హేయం


నగరంలో ర్యాలీగా వెళ్తున్న హిందువులు

అనంతపురం కల్చరల్: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న మారణకాండను వ్యతిరేకిస్తూ బుధవారం సాయంత్రం నగరంలో నిరసన ర్యాలీ జరిగింది. హిందుత్వ ఐక్య వేదిక ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో హిందూ జాగరణ మంచ్ అఖిల భారత సహ సంయోజక్ దేవేంద్రరెడ్డి మాట్లాడారు. బంగ్లాదేశ్ ముస్లింలలోని రెండు వర్గాల మధ్య కొట్లాటలో హిందువులను బలి పశువులను చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హిందూ సభల్లో పాల్గొన్నందుకు అర్థం లేని కారణంతో ఇస్కాన్ స్వామీజీని అరెస్టు చేయడం దారుణమన్నారు. అలాగే ఆయనకు మద్దతుగా నిలిచిన న్యాయవాదులను కూడా ఆస్పత్రుల పాలయ్యేలా చేశారని పేర్కొన్నారు. ఇది ఇలాగే కొనసాగితే ఎవరికీ మంచిది కాదని హెచ్చరించారు. అంతకు ముందు స్థానిక టవర్‌క్లాక్ నుంచి మునిపల్ సర్కిల్ వరకూ సాగిన నిరసన ర్యాలీకి ఆఎస్ఎస్, బీజేపీ నాయకులు, విశ్వహిందూ పరిషత్, హిందూ చైతన్య వేదిక నాయకులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాస్, లలిత్‌కుమార్, హిందూ చైతన్య వేదిక అధ్యక్షుడు విశ్వేశ్వరరెడ్డి, వీహెచ్‌పీ నాయకులు రమణబాబు, తాళంకి రత్నమయ్య, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

డ్యాన్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎంపిక

అనంతపురం కల్చరల్: క్లాసికల్, ఫోక్, వెస్ట్రన్ డ్యాన్సులను స్పోర్ట్స్‌గానూ గుర్తించిన నేపథ్యంలో బుధవారం ఏపీ స్టేట్ డ్యాన్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా శాఖ కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్రరెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ఎన్నికలు నిర్వహించారు. అనంతరం జిల్లా శాఖ చైర్మన్‌గా సీనియర్ నాట్యాచార్యులు డాక్టర్ పట్నం శివప్రసాద్, అధ్యక్షుడిగా మురళీకృష్ణ, కార్యదర్శిగా ధనుంజయ, ట్రెజరర్‌గా చంద్రమోహన్ గౌడ్‌తో పాటూ కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. జిల్లాలో ఔత్సాహికులైన డ్యాన్సర్లకు అవకాశం కల్పిస్తామన్నారు. సమస్యలు ఉత్పన్నమైనప్పుడు ఐక్యంగా పరిష్కరించుకుందామని తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 50 మంది కళాకారులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

అనంతపురం: రాజీవ్ కాలనీకి చెందిన ఓ బాలిక బుధవారం అదృశ్యమైంది. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు త్రీ టౌన్ సీఐ కే.శాంతిలాల్ ఓ ప్రకటనలో తెలిపారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలకు తరలిరండి

అనంతపురం ఎడ్యుకేషన్: ఈనెల 17, 18 తేదీల్లో గుత్తి పట్టణంలో జరిగే ఎస్ఎఫ్ఐ 32వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిద్దు, ఓతూరు పరమేష్ మాట్లాడుతూ.. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం విద్య వ్యవస్థను పూర్తిగా నాశనం చేసేందుకు నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకొచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రియింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ పెండింగ్ బకాయిలు రూ.3,480 కోట్లు విడుదల చేయలేదన్నారు. ‘తల్లివందనం’ అంటూ ఇచ్చిన హామీపై ఎక్కడా మాట్లాడటం లేదన్నారు. యూనివర్సిటీల్లో అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం మాట్లాడటం లేదన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షుడు భీమేష్, ఉపాధ్యక్షులు సోము, వీరు, నాయకులు సాయి, విజయ్, లోకేష్ పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

అనంతపురం: నగరంలోని టీవీ టవర్ సమీపంలోని ఇటుకల బట్టీ వద్ద బుధవారం పేకాట ఆడుతున్న 6 మందిని అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ తెలిపారు. వారి నుంచి రూ.18,650 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించాలి

ఆత్మకూరు: రబీ సీజన్ సాగులో చేసిన పంటలకు ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లంచాలని ఏఈఓ సుజిత బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పంటల బీమా చెల్లించేందుకు సీఎస్‌సీలో క్రాప్ ఇన్సూరెన్స్ పోర్టల్ ఓపెన్ అయినట్లు పేర్కొన్నారు. వరికి ఒక ఎకరాకు రూ.630, మొక్కజొన్న రూ.525, శనగకు రూ.480, జొన్నకు రూ.315, వేరుశనగకు రూ.480, టమాటకు రూ.1,600 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు. పంటలకు బీమా చెల్లించేందుకు ఈనెల 15వ తేదీ తుది గడువు అని.. వరికి మాత్రం ఈనెల 31 వరకూ గడువు ఉంటుందని వెల్లడించారు. ప్రీమియం చెల్లించేందుకు కౌలు రైతులు కూడా అర్హులని పేర్కొన్నారు.

జారిపడితే ప్రాణాలకే ముప్పు


లేబర్ వార్డు ముందు నడుచుకుంటూ వస్తున్న గర్భిణి, పక్కనే పైప్‌లైన్ లీకేజీ కావడంతో బోర్డు ఉంచిన దృశ్యం

ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని వివిధ వార్డుల్లో ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడింది. ఆస్పత్రిలోని లేబర్ వార్డు ఎదురుగా ఉన్న రెండు పైప్‌లు లీకేజీ కావడంతో మురుగు బయటకు వస్తున్నా.. పట్టించుకోవడం లేదు. లేబర్ వార్డు నుంచి గర్భిణులు స్కాన్‌లు, ఎక్స్‌రే, తదితర వాటికి వెళ్తుంటారు. అదేవిధంగా నొప్పులు వచ్చే గర్భిణులు సైతం వాకింగ్ చేస్తుంటారు. ఇటువంటి తరుణంలో లేబర్ వార్డు ముందే రెండు పైప్‌ల లీకేజీ కావడం కలవరపెడుతోంది. పొరపాటున జారిపడితే గర్భిణుల ప్రాణాలకే ప్రమాదం. ఇటీవల ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో రాయదుర్గానికి చెందిన జ్యోతి అనే గర్భిణి కళ్లు తిరిగి కిందకు పడి, చివరకు ప్రాణాలు కోల్పోయిన విషయం విదితమే. ప్రభుత్వ సర్వజనాస్పత్రి అధికారులు మేలుకుంటే గర్భిణులు, తదితరులకు ఎటువంటి ఇబ్బందులు ఉండవు. – అనంతపురం మెడికల్:


ఎక్స్‌రేకు వెళ్లే మార్గంలో ఇలా..